# స్పృహ

పుప్పాల నరసింహం

సాయం సంధ్యవేళ, వాకిళ్ళలో నీడలు పొడుగ్గా కనిపిస్తున్నాయి. అంతవరకు 'సూర్యుడు తొక్కి తొక్కి' వేడి చేసిన భూమిని చల్లార్చేందుకు చంద్రుడు సిద్ధమవుతున్నాడు.

ఆ పూట నీరెండ చల్లగా, తేమగా వుంది. కోళ్ళు తమ పిల్లలతో అంతవరకు పెంటలపై, మోరీలలో మేత మేసి ఇక ఇళ్ళకు దగ్గరగా వచ్చి తిరుగుతూ వున్నాయి. వెలుగు ఎంతో వేగంగా తెరమరుగవుతున్నట్టు అనిపిస్తోంది.

ఇవన్నీ ఏమీ పట్టకుండా పధ్నాలుగేళ్ళు పైబడిన గౌరి, ఆ అమ్మాయి మిత్ర బృందం ఆడుకుంటూ వున్నారు. ఆ పిల్లల గుంపులో గౌరే పెద్ద. మిగతా వాళ్ళంతా తక్కువ వయసున్నవారే. ఒకరిద్దరు ఆడ పిల్లలు చంకల్లో తమ తమ్ముళ్ళనో, చెల్లెళ్ళనో వేసుకుని ఆడుతూ వున్నారు. వాళ్ళకు ఏ ఆటా అర గంటకు పైగా రుచించడంలేదు. ముఖ్యంగా గౌరి కొద్దిసేపు ఓ ఆట ఆడగానే విసుగొచ్చి ఆటమార్పిం చేస్తున్నది. తనకు తోచిన ఆట ప్రతిపాదించగానే మిగతా పిల్లలు పరేనని ఆ అమ్మాయి వెనకాల మూగుతూ వున్నారు.

ఆ పిల్లలకు కావలసింది ఆట- వారిలో గౌరి తప్ప మరెవరు వారిని ఆడించలేకుండా వున్నారు. ఆ గుంపులో ఒకరిద్దరు మగపిల్లలు వున్నా వాళ్ళ బుర్రలకు తట్టని ఆలోచనలు గౌరికి తట్టడంతో, ఆమె ప్రతి పాదిస్తూనే వెంటనే అందరూ 'సై' అంటూ తూనీగల్లా ఎగురుతూ వున్నారు.

గౌర బలిష్టమైన ఆకారం గల అమ్మాయి. వెడల్పు మొఖం. చామనఛాయ నిగ్గుదీసినట్టుగా వుంది. పెద్ద కళ్ళు, నల్లటి కనురెప్పలు- వెడల్పైన ముఖానికి తగ్గట్టు ముక్కు, పెదవులు, గెడ్డం, ఆ అమ్మాయి వెంట్రుకలు అంత నలుపుగా ఎందుకున్నాయో తెలియదు. చెవులకు లోలకులు వేసుకుంది. గట్టిగా తల దువ్వుకుని ఆరిందాలా ఒక జడవేసుకుని లంగా, జాకెట్‌తో సీతాకోకచిలుకలా ఎగురుతూ వుంది.

ఆటలాడుతున్న పిల్లల తల్లిదండ్రులు వారి వారి పనుల నుంచి ఇంకా ఇళ్ళకు చేరలేదు. అందుకే స్వేచ్ఛగా, వారి మనోభావాలకు అనుగుణంగా ఆడుకుంటూ, పాడుకుంటూ వున్నారు. అంతసేపు గెంతినా వారికాళ్ళు నొప్పి పుట్టడంలేదు. పగలబడి నవ్వినా వారి కడుపుకది ఆయాసమనిపించడంలేదు. గోలగా అరచినా వారి గొంతు నొప్పి అనిపించడం లేదు.

గౌరితో సహా ఎవరికీ ఆ సమయంలో ఎవరి ధ్యాసలేదు. ముఖ్యంగా గౌరికి తండ్రి పొలం నుంచి వస్తాడని కాని, తల్లి కూలిపని నుంచి వస్తుందని గాని, ఇంటి వద్ద ఏమవుతుందనిగాని, దారి వెంట ఎవరు వస్తున్నారు? ఎవరు పోతున్నారు? అన్న ధ్యాస కాని లేనేలేదు. సంతోషంగా నవ్వుతూ, తుళ్ళుతూ తన మనసు చెప్పిన తీరులో ఎగురుతూ, గెంతుతూ వుంది.

అంతగా గెంతినా, ఆడినా గౌరి ముఖం వికసిస్తున్నట్టుగానే వుంది కాని, అలసిపోయినట్టు మాత్రం అనిపించడంలేదు. ఆటవల్ల ముక్కు మీద, పై పెదవిపై చెమట ఊరి ఆ అమ్మాయి ముఖం మరింత కాంతితో కనిపిస్తోంది.

ఆ సమయంలో ఇళ్ళ చూరుల మీదకు ఊర పిట్టలు చేరి కిచకిచమంటున్నాయి. చెట్టుకొమ్మ మీద నుంచి రామచిలకల జంట ఎగిరిపోతూ వున్నది. ఎక్కడి నుంచో ఓ కొంగ వచ్చి చెట్టుమీద వాలింది. దగ్గరలోని పాడుబడిన బావిలో గూడుపెట్టుకున్న పావురాలు చప్పుడు చేస్తూ బయటకొచ్చాయి. బరెంక పిట్టలు అదేపనిగా చప్పుడు చేస్తూ ఈ చెట్టు మీద నుంచి ఆ చెట్టు మీదకు, ఆ చెట్టుమీద నుంచి ఈ చెట్టు మీదకి తిరుగుతూ వున్నాయి. ఎక్కడో లేగ దూడ అంబా అన్నది.

ఈ భౌతిక ప్రపంచాన్ని పట్టించుకోని గౌరి, ఆమె మిత్ర బృందం పరుగుదీసి ప్రమీల అనే అమ్మాయి ఇంట్లోకి జొరబడింది. ఆ గుంపులో ప్రమీల కూడా వుంది. అంతవరకూ ఆడిన దొంగాట ఆపి, పూలు తెంపి, బతకమ్మను చేసి ఆడదామని నిర్ణయించుకుని ఆ గుంపు ప్రమీల ఇంటికి వచ్చింది.

ప్రహరీ గోడ దాటాక ప్రమీల ఇంట్లో 'జారాదు' వద్ద, నీళ్ళ గోళెం పక్కన పెద్దగా పూల పూల లంగా పరచుకుని కూర్చున్నట్టుగా గుల్మొఖి పూల చెట్టు వుంది. ఆ చెట్టు నిండా ఎర్రటి గుల్మొఖి పూలు అర అంగుళం కాడలతో చూడ్డానికి ఎంతో ముద్దుగా వున్నాయి. ఇంకా విచ్చుకోని మొగ్గలు కూడా చెట్టు నిండా వున్నాయి. మిరియపు గింజల్లా నల్లగా ఆ చెట్టు విత్తులు అక్కడక్కడా వున్నాయి.

ఆ చెట్టును చూడగానే పిల్లలు గోల గోల చేస్తూ చెట్టు మీద పడ్డారు. ఒకరిని కాదని ఒకరు కొమ్మలను లాగడంతో సన్నటి కొమ్మలు కొన్ని విరిగిపోయాయి. అయినప్పటికీ వదలకుండా పూలను తెంపుతూనే వున్నారు పిల్లలు.

అందరికన్నా ముందు నిలబడి పొడవైన చేతులతో గౌరి గబగబా పూలు తెంపసాగింది. తన పక్కకు చేరిన వారిని జరుపుతూ పూలను తెంపగా లంగాలో చాలా పూలు పోగయ్యాయి.

ఆ గుల్మొఖి పూల చెట్టు పక్కనే వున్న గోరెంక పూలు ఎంత సుకుమారంగా వున్నాయంటే ముట్టుకుంటే వాటి రెక్కలు రాలిపోయేంత సుకుమారంగా వున్నాయి. లేత నీలి రంగుకు నారింజరంగు పులిమినట్టు పలచగా, ఆ నీరెండలో ఎంతో బాగా కనిపిస్తున్నాయి. కొమ్మలతో సహా ఆ పూలను కూడా కొన్నింటిని తెంపింది గౌరి.

పూలు సరిపోతాయనిపించాక గౌరి "ఏయ్ చాలు నదువుండే!" అని ఆజ్ఞాపించింది.

దాంతో పిల్లలు పూలను తెంపడం ఆపి గౌరి వంక తిరిగారు. గౌరి పూలతో వున్న లంగాను ఓ చేత్తో పట్టుకుని, మరో చేత్తో రెండు గుల్మొఖి పూలను తన తలలో పెట్టుకోవడానికి తలను కాస్త పక్కకి వంచింది.

అంతలోనే ప్రమీల అన్న సుందరం ప్రహరి గోడ దాటి లోపలికి వచ్చాడు. అప్పటికి సూర్యుడు ఆ రోజుకు చివరి వెలుగు వెలుగుతూ వున్నాడు. ఆ వెలుగుకు ఎంత శక్తి వుంది? ఎంత ప్రకాశవంతంగా వుంది? ఎంత వర్ణలేపనం వుంది? ఎంత సమ్మోహనంగా వుంది? మబ్బుచాటు నుంచి వెలిగిన ఆ వెలుగు పూలు తురుముకుంటున్న గౌరిపై, ఆ అమ్మాయి పక్కనున్న ఒకరిద్దరు పిల్లలపై పడింది. తల వంకరగా పెట్టి, పూలతో వున్న లంగా కాస్త పైకి ఎత్తిపట్టి, పుష్టిగా వున్న ఆ అమ్మాయి పలువరస ఆ వెలుగులో మరింత గొప్పగా వెలిగిపోతుండగా సుందరం చూపులు ఆ అమ్మాయి మీదనే నిలిచి పోయాయి.

సుందరంకు మహా అయితే పదహారు సంవత్సరాలుంటాయి. చాలా సార్లు సుందరం, గౌరి కలిసి ఆడుకున్నారు, పోట్లాడుకున్నారు. తిరిగి కలిసి మెలిసి తిరిగారు. కాని గత రెండు సంవత్సరాలుగా సుందరం తన తండ్రికి ఆసరాగా వ్యవసాయపు బావి వద్ద పని చేస్తూవున్నాడు. దాంతో సుందరం శరీరం బాగా పొంగినట్టుగా వుంది. పుష్టిగా తయారయ్యాడు. ముఖంలో మునుపటి లేతదనం పోయి నిగ్గు కనిపిస్తోంది. కళ్ళు తెల్లగా విచ్చుకున్నట్టున్నాయి. అంతకు ముందు వరకు పొలంవద్ద టొమేటో చెట్లకు నీరు పెడుతూ, కాలువలు నరుకుతూ, కాలువలు కడుతూ వుండడంతో తన రెట్టలు పొంగినట్టు తనకే తెలుస్తోంది. తన ముఖం తేటగా రక్తంతో పొంగి వున్నట్టు తనకే అనిపిస్తోంది. నత్తయిన జుట్టు మరింత

పెరిగి పెద్దయినట్టు అనిపిస్తోంది.

సుందరం ఆ విధమైన రూపంతో తనవైపే దీక్షగా చూడ్డంతో గౌరి లేత మనసు క్షణం తొట్రుపడింది. లయ తప్పినట్టనిపించసాగింది. ఆ చూపుల్లో ఏదో వింత శక్తి వున్నట్టు అనిపిస్తోంది. గౌరి అలాగే సుందరాన్ని చూడసాగింది, కాని ఎక్కువ సేపు చూడలేకపోయింది. ఎన్నడూ లేనిది, ఎప్పుడూ లేనిది ఆ సమయంలో ఏదో భరించలేనట్టుగా వుంది. ఇక అక్కడ నిల్చోవడం గౌరి తరం కాలేదు. మెరుపు మెరిసినంత సేపట్లో గౌరి లంగా కిందికేసుకుని, మారు మాట్లాడకుండా, ఎవరినీ చూడకుండానే పరుగు తీసింది. లంగాలోని పూలన్నీ కుప్పలా అక్కడే పడిపోయాయి. సుందరం పరిగెత్తిన గౌరినే చూశాడు.



సుందరం చూపులు తిప్పేసరికి పిల్ల మూక అక్కడే వుంది. నిశ్చలంగా అలాగే చూడ్డంతో కోపంతో చూస్తున్నాడని, పూలు తెంపినందుకు కొడతాడేమోనని పిల్లలు నక్కి నక్కి ఒకరి వెనకాల ఒకరు తలుపు వైపు నడుస్తూ వున్నారు. తలుపు దగ్గరకు రాగానే పరుగందుకున్నారు.

తప్పు చేసిన దానల్లే ప్రమీల ఒక్కతే అక్కడ నిల్చున్నది బిక్కు బిక్కుమంటూ. సుందరం అలాగే చూస్తూ నిల్చున్నాడు. ప్రమీల భయపడుతూ అన్ననుద్దేశించి "గౌరే తెంపుదాం రా! అన్నది" తన తప్పేమీ లేదన్నట్టుగా చెప్పింది.

"ఆ పూలు ఆ పిల్లకే ఇయ్యిపో..." అని సుందరం ఆజ్ఞాపించినట్టుగా అన్నాడు.

ప్రమీల నమ్మలేనట్టుగా ముఖమంతా నవ్వుచేసుకుని గబగబా కిందపడిన పూలను, తన లంగాలోని పూలలో వేసుకుని గౌరి ఇంటికి పరుగుతీసింది విమానంలా.

సుందరం ఇంట్లోకెళ్ళాడు.

గౌరి తమ ఇంటి అరుగుమీద గుంజకు ఆనుకుని కూర్చుంది. ఓ కాలు జాపి, ఓ కాలు మడిచి కూర్చుంది. నిలకడగా వున్న బావి నీటిలో పెద్ద రాయి వేసినట్టుగా వుంది గౌరి మనసులో- అలా ఎందుకయిందో కూడా తనకు తెలియడంలేదు. సుందరాన్ని చూస్తే అలా ఎందుకనిపించిందో తెలియడంలేదు. ఆ విషయం ఆలోచించకూడదనుకుంటూనే ఆ విషయమే ఆలోచిస్తూ వుంది గౌరి...

పూలతో వచ్చిన ప్రమీలకు గౌరిని చూడగానే నిరుత్సాహమేసింది. గౌరిని ఎప్పుడు అంత ముభావంగా చూడలేదు ప్రమీల. అయినా వీలైనంత ఉషారుతో "మా అన్న ఏం అన్లేదు. పూలు తీసుకోమన్నాడే!..." అంది.

ఆ మాటకు గౌరిలో ఎలాంటి స్పందనా లేదు. రెండు పెదవులనూ అలనల్లన కదిలించి ఊరుకుంది. ఏమన్నదో, ఏమనుకున్నదో తెలీదు.

ప్రమీలకేం పాలుపోలేదు. దాంతో ప్రతిసారీ అన్నట్టుగానే.

"ఆడుకుందాం రా!..." అంటూ ఆహ్వానించింది.

"నేను రాను పో..." అంటూ గౌరి ఖచ్చితంగా చెప్పి, చాపిన కాలును దగ్గరకు తీసుకుంది.

అంత కటువుగా అనేసరికి ప్రమీల లంగాలోని పూలను గౌరి ముందు పోసి... "ఊహు..." అంటూ గునిసి విసురుగా వెనక్కి తిరిగింది.

అంతవరకూ ఆడి, పాడి, ఎగిరి, దుమికి, కోలాహలంగా, సెలయేటి పాయలా, సందడిగా,చైతన్యంతో తిరిగిన గౌరి గుంజకు ఒరిగి నిశ్చలంగా కూర్చుని ఏదో జరిగినట్టు దిక్కులను చూస్తున్న గౌరికీ,ఎక్కడా పొంతన కనిపించడంలేదు.

తనకేమయిందో తనకే తెలియడంలేదు. కానీ ఎక్కడో తన మనసుమూలల్లో ఏదో జరిగింది అనే భావన మాత్రం కలుగుతూ వుంది. కాని ఏమిటది? తెలియదు! తెలియకుండా జరిగిందేమిటి? ఏమో! ఎందుకిట్లా జరిగింది? అసలే తెలియడంలేదు...

గౌరి ఇప్పుడు ముందటి గౌరి కాదు. గౌరిలో ఇప్పుడు వర్తమానంతో పాటు గతం, భవిష్యత్ తీయ తీయగా మేల్కొంటున్నాయి! కొత్త స్పృహ తలెత్తుతోంది.